టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా శాంతికుమారి


శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి ఎన్నికయ్యారు. డిసెంబరు 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో నిర్వహించిన మహాసభల్లో ఆమెను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుల ఊశన్న, ఇందురావు, ప్రీతి, రమేష్, హేమంత్, కమలాకర్‌రెడ్డి, దుర్గయ్య, మోహపత్‌రావు, సుభాష్, మహి పాల్; శ్రీనివాస్, తులసీరాం, సమ్మయ్య, నవీన్, త్రిమూకరావు తదితరులు అభినందించారు. సంఘం బలోపేతంతో పాటు సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కోరారు.

ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సాధారణ సెలవులు సందర్భంగా జిన్నింగ్ మిల్లులలో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లు బుధవారం నుంచి ఐదో తేదీ వరకు నిలిపి వేస్తున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు. తిరిగి ఈ నెల 6వ తేదీన కొనుగోళ్లు కొనసాగుతాయని తెలిపారు.

న్యూ ఇయర్ సందడి



కాగజ్‌నగర్‌లో సిద్ధం చేసిన కేకులు

ముగ్గు కలర్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

- కిటకిటలాడిన స్వీట్ దుకాణాలు, హోటళ్లు, బేకరీలు, వైన్సులు
- ప్రత్యేక ఆఫర్లతో ఆకట్టుకున్న వ్యాపారులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త సంవత్సరం సందడి నెలకొంది. మంగళవారం రాత్రి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జిల్లాలోకి యువత, ప్రజలు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, ఆయా మండల కేంద్రాల్లో బేకరీలు, స్వీటు దుకాణాలు, వైన్సులు, హోటళ్ల వద్ద సందడి నెలకొంది. వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులకు ఆకర్షించారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ.. 2025కు స్వాగతం పలుకుతూ మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా యువత కేరింతలతో హంగామా చేశారు. తమ ఆశలు ఫలించాలని, కోరికలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ న్యూ ఇయర్‌కు వెల్‌కమ్ చెప్పారు. ఈ సంవత్సరంలో మంచి వర్షాలు కురిసిన పంటలు పండాలని రైతులు, వ్యాపారాలు వృద్ధి చెందాలని వ్యాపార వర్గాలు, వేతనాలు పెరగాలని ఉద్యోగులు, పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులు, ప్రజల్లో తమ పలుకుబడి పెరగాలని రాజకీయ నాయకులు.. ఇలా ఎవరికి వారు తమ ఆశలు. ఆశయాలు నెవరేరాలని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.


ఆసిఫాబాద్‌లో కేక్ దుకాణం వద్ద యువకులు

జోరుగా మాంసం, మద్యం విక్రయాలు

జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం నుంచే మాంసం విక్రయాలు కొనసాగగా మద్యం షాపుల వద్ద సందడి కనిపించింది. పార్టీలు జరుపుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా అంతా పలు చోట్ల ఏర్పా ట్లు చేసిన కేకుల దుకాణాలు, బేకరీల వద్ద యువత, విద్యార్థుల సందడి కనిపించింది. వస్త్రనిలయాలు, వ్యాపార సంస్థల వద్ద మహిళలు తమకు నచ్చిన వస్త్రాలు, వస్తువులు, రంగురంగుల ముగ్గులను కొంటూ కనిపించారు. బైకులపై కుర్రకారు షికారు చేస్తూ హపీ న్యూయర్ అంటూ అరుపులతో ఎంజాయ్ చేశారు. జనవరి 1కి స్వాగతం చెబుతూ తమఇళ్లలోగిళ్లను రంగులమయం చేసేందుకు రంగులను, టపాసులను కాల్చడానికి పలు రకాల బాంబులు, తారాజువ్వలను కూడా కొనుగోలు చేశారు. దూర దేశా ల్లో, పలు ప్రాంతాల్లో ఉన్న వారికి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పోలీసుల బందో బస్తు..

న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి అపస్తుతులు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

అభివృద్ధి పనులు పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

జైనూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్లు దీపక్ తివారి డేవిడ్ మంగళవారం పరిశీలించారు. దీపక్ తివారి మాట్లాడుతూ మార్లవాయిలో గ్రామ కార్యదర్శులకు శిక్షణ కేంద్రం, డిజిటల్ గ్రంథాలయం పనులు పకడ్బందీగా చేపట్టాలని ఐటీ డీపీ ఏఈ ఇందల్‌సింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీపీ డీఈ శివ ప్రసాద్, మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, కనక వెంకటేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే..

సిర్పూర్(యు), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాగాంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో కృష్ణారావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా వెళ్లాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్, రాజ్‌గోండ్ సేవా సమితి భవనంలో మంగళవారం భవిష్యత్ కార్యాచ రణపై నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. సమస్యలు ఐక్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశంలో గోండ్వానా నాయకులు అర్జున్ మాస్టర్, మోతిరాం, సుధాకర్, నర్సింగరావు, జ్ఞానేశ్వర్, యశ్వంత్‌రావు, శంకర్, భీంరావు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

బెల్లంపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై కేసు నమోదైంది. పట్టణంలోని బజార్ ఏరియాలో ఈనెల 29న ఆరిజన్ డెయిరీ నిర్వాహకుడు ఆది నారాయణపై దాడి జరిగిన ఘటనలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై, కాంగ్రెస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌పై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో దేవయ్య పేర్కొన్నారు.

-విచారణ చేయకుండా కేసు నమోదు సరికాదు

ఆదినారాయణపై పదికి పైగా కేసులు ఉన్నాయని, అలాంటి వ్యక్తి ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టకుండా పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నేర చరిత్ర గల ఆదినారాయణను పెంచి పోషిస్తూ తనపై తప్పుడు ప్రచారం చేయించాడని పేర్కొన్నారు. కేసు నమోదు వెనక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. పోలీసులు విచారణ చేపట్టి నాపై నమోదు చేసిన అక్రమ కేసును కొట్టివేయాలన్నారు. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరస నలు, ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

మంచిర్యాల క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయంలో చోరీకి పాల్పడిన సయ్యద్ అఫ్సర్ ఆలీకి రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. 2024 జూన్ 9న చోరీ జరిగినట్లు ఆలయ అర్చకులు రాంశర్మ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిందర్, లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సాక్ష్యులను ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో తీర్పును వెలువరించినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు.

సోషల్‌మీడియా పోస్టులపై కేసు నమోదు


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో నిరాధార ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండ లంలోని ఎల్కంటి గ్రామానికి చెందిన బేతు తిరుపతిరెడ్డి రెండు రోజుల క్రితం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పీఏ రమణరావుపై నిందారోపణలు చేస్తూ పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సోషల్ మీడియాలో నిందారోపణలు చేస్తూ గ్రూపులలో షేర్ చేస్తే గ్రూపు అడ్మిన్‌లకు, వైరల్ చేసిన వారిపై ఐటీ యాక్టు కేసుతోపాటు పరువు నష్టం కింద కేసు నమోదవుతుందని హెచ్చరించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. జర్నలిస్టులు వార్తలు రాసేటప్పుడు వివరణ తీసుకోవాలని, ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు.

ఇండ్లలోకి వచ్చిన చుక్కల దుప్పి

వేమనపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నీల్వాయి అటవీ క్షేత్ర పరిధిలోని మల్లంపేట గ్రామంలో మంగళవారం సమీప అడవిలో నుంచి ఓ చుక్కల దుప్పి ఇండ్లలోకి ప్రవేశించిందని ఎఫ్ఆర్‌వో అప్పలకొండ తెలిపారు. మల్లంపేట గ్రామానికి చెందిన అక్కల మధుకర్, అంకూర్ శంకర్, అంగ గట్టయ్యలు సమాచారం ఇవ్వడంతో డిప్యూటీ ఆర్‌వో ప్రమోద్, బీట్ ఆఫీసర్ మహిపాల్‌లు సంఘటన స్థలానికి చేరుకుని చుక్కల దుప్పిని అడవిలో వదిలిపెట్టినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఊర కుక్కల బారి నుంచి కాపాడి అడవిలో విడిచిపెట్టేందుకు సహకరించిన గ్రామస్థులను అటవీ అధికారులు అభినందించారు.

కవ్వాల్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశం

-ఇద్దరిపై కేసు, బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

జన్నారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్ కోర్ ఏరియాలోని పైడిపెల్లి బీట్ కంపార్టుమెంట్ బైసన్‌కుంట ప్రాంతంలోకి అనుమతులు లేకుండా ప్రవేశించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపారు. ఈనెల 29న రాత్రి రెండు కార్లు టీఎస్8ఎఫ్ఆర్8529, ఏపీ25ఆర్7444ను సీజ్ చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినందుకు మండలానికి చెందిన సంతోష్, మహేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే విధుల్లో అశ్రద్ధ వహించినందుకు పైడిపెల్లి బీట్ అధికారి తన్వీర్ పాషాను సస్పెండ్ చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

దండేపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రధాన సెంటర్‌లో మంగళవారం రాత్రి సీఐ అల్లం నరేందర్ ఆధ్వర్యంలో ఎస్సై ఉదయ్‌కిరణ్ డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. న్యూఇయర్ వేడుకలను సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అండర్ బ్రిడ్జి, ఐబీ చౌరస్తా, ప్రధాన కూడళ్ల వద్ద ఎస్ఐ కిరణ్‌కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలతో పాటు వాహనాలను తనిఖీ చేశారు.

భార్యను దూరం చేస్తున్నాడని మేనమామపై హత్యాయత్నం


శ్రావణ్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): భార్యను దూరం చేస్తున్నాడని ఆమె మేనమామపై తల్వార్‌తో దాడి చేసి హత్యాయత్నం చేసిన సంఘటన మంగళవారం గోదావరిఖనిలో చోటుచేసుకుంది. పోలీసులు క్షతగాత్రున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. గోదావరిఖని ఏసీపీ రమేష్ వన్‌టౌన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్ ఆరు సంవత్సరాల క్రితం గోదావరిఖని వినోభానగర్‌కు చెందిన కాళ్ల పూజను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. శ్రావణ్‌కు మరొకరితో వివాహేతర సంబంధం కారణంగా భార్యభర్తల మధ్య గొడవలు జరిగి పెద్దల సమక్ష్యంలో రాజీ కుదిరింది. పూజను శ్రావణ్ వేధిస్తుండడంతో ఆమె మేనమామ గోదావరిఖని వినోభానగర్‌కు చెందిన నంది శ్రీనివాస్ జోక్యం చేసుకుని పలుమార్లు మందలించాడు. ఇటీవల పూజను కొట్టడంతో నంది శ్రీనివాస్, అతని సోదరుడు నగేష్, పూజ సోదరుడు కాళ్ల కిరణ్ భీమారం వెళ్లి ఆమెను, పిల్లలను గోదావరిఖనికి తీసుకువచ్చారు. దీంతో పగ పెంచుకున్న శ్రావణ్ అతని తల్లిదండ్రులు నరేందర్, పద్మ, చిన్నమ్మలు వేద వరలక్ష్మీ, పర్శ స్వప్న, అతని అమ్మమ్మ బతుకమ్మ కుట్ర పన్ని మంగళవారం గోదావరిఖనికి వచ్చారు. నంది శ్రీనివాస్ వద్దకు వెళ్లి మాట్లాడేది ఉందని బైక్‌పై ఎక్కించుకుని గోదావరిఖని బాలుర జూనియర్ కళాశాల మైదానంలోకి తీసుకువచ్చాడు. గొల్ల శ్రావణ్ వెంట తెచ్చుకున్న కత్తితో శ్రీనివాస్‌ను విచక్షణ రహితంగా పొడిచాడు. నిందితుడు శ్రావణ్ పారిపోతుండగా గంగానగర్ వద్ద పట్టుకున్నామన్నారు. నంది నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్ఐ భూమేష్ పాల్గొన్నారు.

కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు

● 50కి పైగా దరఖాస్తులు ● ప్రభుత్వానికి అధికారుల నివేదిక

> జిల్లాలో కొత్త పంచాయతీల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త మండలాలు, పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. ఈ మేరకు అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.



ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కొత్త పంచాయతీల ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొత్త మండలాలు, పంచాయతీల కోసం ఇటివల ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, కొన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి దరఖాస్తులు చేశారు. పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతనంగా జిల్లాలు, మండలాలు, పంచాయతీలను ఏర్పాటు చేసింది. గతంలో జిల్లాలో 162 పంచాయతీలు ఉండేవి. ఆగస్టు, 2018లో నూతనంగా 173 పంచాయతీలను సర్కారు ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలో మొత్తం 355 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. కానీ వీటి ఏర్పాటు తర్వాత కొన్ని గ్రామాల ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. పాత గ్రామపంచాయతీ దగ్గరగా ఉన్న తమ గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలో కలపడంతో దూరం పెరిగిందని, కొన్ని గ్రామాలు వాగులు, వంకలు, గుట్టల మధ్య ఉండడం అలాంటి వాటిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయకుండా వేరే వాటిలో కలిపారని, ఇలా పలురకాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఫలానా గ్రామాలను కలుపుతూ కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయాలంటూ దరఖాస్తులు చేశారు. కానీ వాటిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో అక్కడితోనే ఆగాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కొత్త పంచాయతీల ఏర్పాటు మళ్లీ తెరపైకి వచ్చింది.

● జిల్లా వ్యాప్తంగా..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కొత్త పంచాయతీల కోసం 50కిపైగా దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ, పంచాయతీకి మధ్య కనీసం2 కిలోమీటర్లకు మించి దూరం ఉన్న రెవెన్యూ గ్రామాలు, వాటిలో కనీసం 500జనాభా ఉండేలా చూడడం, వాగులు, వంకలు, గుట్టల మీద ఉన్న గ్రామాల్లో కనీసం 300 జనాభా ఉన్నా ప్రత్యేక కేటగిరిగా భావించి కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల సూచించింది. ఈ మేరకు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. సుమారు 25దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదించారు. వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలించి మంత్రివర్గం ఆమోదం పొందిన తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి. అసెంబ్లీ సమావేశాలు ఇటీవల పూర్తి కావడంతో మళ్లీ జరిగే సమావేశాల్లో ప్రవేశ పెడతారా లేదా ఆలోపు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా గవర్నర్ ఆమోదంతో ప్రకటిస్తారో వేచి చుడాలి. కాగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పనులు చురుకుగా సాగుతున్నాయి. జనవరి నెలలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త పంచాయతీలు, మండలాల ఏర్పాటుపై దృష్టి సారించింది. దీంతో వీటి ఏర్పాటు తర్వాతే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం..



ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. జిల్లాలో కొత్త పంచాయతీలకోసం 50కి పైగా దరఖాస్తులు వచ్చాయి. 25 దరఖాస్తులను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. కొత్తగా 15 నుంచి 20 గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు బావిస్తున్నాం.

- భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

బైక్ అదుపు తప్పి ఇద్దరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


సాయి(ఫైల్)

బెజ్జూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఇప్పలగూడ ఎక్స్‌రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయా లయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఇప్పలగూడ గ్రామానికి చెందిన నైతం అజయ్, మొగవెల్లి గ్రామానికి చెందిన ఆత్రం శంఖ్కతోపాటు చింతలమానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన మెస్రం సాయి మొగవెల్లి నుంచి ఒకే ద్విచక్ర వాహనంపై ఇప్పలగూడ గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో ఇప్పలగూడ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకు పోయింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు కింది పడ్డారు. ఇందులో మెస్రం సాయి(18) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నైతం అజయ్, ఆత్రం శఙ్కకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని కాగజ్‌నగర్‌కు 108 వాహనంలో తరలిస్తుండగా నైతం అజయ్(20)మార్గ మధ్యలో మృతి చెందాడు. ఆత్రం శఙ్కక కాగజ్‌నగర్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపులి సంచారం


అధికారులు గుర్తించిన పులి అడుగులు

పెంచికలపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి అటవీ ప్రాంత పరిధిలో పెద్దపులి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొండపల్లి సమీప అటవీ ప్రాంతంలో మంగళవారం ట్రాకింగ్ సిబ్బంది పులి అడుగులు గుర్తించారు. అక్కడ నుంచి బెజ్జూరు వైపు వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు వ్యవసాయ పనులకు గుంపులుగా వెళ్లాలని సూచించారు.

హైమన్‌డార్ఫ్ వర్ధంతికి తరలిరావాలి

జైనూర్, డిసెంబరు 31 ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయిలో జనవరి 11వ తేదీన నిర్వహించనున్న హైమన్‌డార్ఫ్ వర్ధంతికి ప్రజలు తరలిరావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం వర్ధంతి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, సహకార బ్యాంక్ మేనేజర్ సత్య శివాణి, ఆదివాసీ నాయకులు మేస్రాం అంబాజీ, మడావి భీంరావ్, సీఈవో సోనకాంబ్లే జనార్దన్, కార్యదర్శి ప్రకాష్, నాయకులు పెందుర్ ప్రకాష్, కనక గంగారాం, హుస్సేన్, మధు, కనక గంగారాం, డార్ఫ్‌సర్‌మెడి జుగునాక దేవరావ్, డార్ఫ్ యూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

చప్రాడకు చేరుకున్న భక్తులు


పాదయాత్రగా చప్రాడకు వెళ్తున్న భక్తులు

కౌటాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, వేమనపల్లి నుంచి 120 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన భక్తులు మహారాష్ట్రలోని ప్రశాంత్ ధామ్ చప్రాడకు చేరుకున్నారు. ఈ నెల 29న మంచిర్యాల, వేమనపల్లి మండలాల నుంచి దాదాపు 500 మంది భక్తులు 22వ పాదయాత్రకు బయలుదేరగా మంగళవారం కౌటాల మండల కేంద్రంలో బోనగిరి లక్ష్మి, సుధాకర్, బోనగిరి శ్రీమతి, సంతోష్‌లు అన్నప్రసాదం చేశారు. అనంతరం మండలంలోని తుమ్మిడిహెట్టి ప్రాణహిత నది మీదుగా చప్రాడకు చేరుకుని కార్తీక్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అక్కడే బస చేసి మరుసటి రోజు తిరుగు ప్రయాణం కానున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కెరమెరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీటీ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కల్లెగాం టీడబ్ల్యూపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈఆర్‌పీ శ్యాంరావు, ఉపాధ్యాయులు నారాయణ ఉన్నారు.

● సంక్షిప్తం..

● కాగజ్‌నగర్ అపరిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

- పట్టణంలో మంగళవారం మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాలులో శివపురాణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉజ్జాయిని నుంచి వచ్చిన ప్రవచన కర్త సూరజ్ శర్మాజీ శివ పురాణం భక్తులకు వివరించారు.

● ఆసిఫాబాద్: జిల్లాలో విచ్చలవిడిగా డయాగ్నస్టిక్ సెంటర్‌లు, ప్రైవేటు ఆసుపత్రులలో ఎలాంటి ధరల పట్టిక లేకుండా ఇష్టారాజ్యంగా ప్రజల వద్ద నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ షఫికి వినతిపత్రం అందజేశారు.

- జిల్లా కేంద్రంలోని ముదిగంటి సూర్యమ్మ బీఈడీ కళాశాలలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలు వాటి విలువలను తెలిసే ఉద్దేశ్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

● బెజ్జూరు: కొనుగోలు కేంద్రాల్లో జనవరి ఐదో తేదీలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

- చిన్నసిద్దాపూర్ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

- టైగర్ కారిడార్ పేరుతో అటవీ అధికారులు బెదిరింపులకు పాల్పడడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు రాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

● ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె దీక్షలు 22 వ రోజుకు చేరుకున్నాయి

● చింతలమానేపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ జనవరి 8వ తేదీన భీమదేవర జెండా పండగ, కొలావార్ ఆత్మ గౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమదేవర జెండాను ఆవిష్కరించాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు శంకర్ కోరారు.

● కౌటాల: ఇటీవల బెల్లంపల్లిలోని నిర్వహిం చిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో గురుడుపేట ప్రభుత్వ ఆయూష్ హెల్త్ వెల్నెస్ యోగా సెంటర్‌లో శిక్షణ పొందిన దాసరి చార్మిక(ప్రథమ), నికాడే యశ్విత (ద్వితీయ స్థానం), సబ్ జూనియర్ విభా గంలో బట్టి అఖిల్ సింగ్(ప్రథమ), నాగచైతన్య(ప్రథమ) స్థానంలో నిలిచి బంగారు, రజిత పతకాలు సాధించారు.

- కొనుగోలు కేంద్రాల్లో జనవరి ఐదో తేదీ వరకే ధాన్యం కొనుగోళ్లు చేస్తామని గురుడుపేట పీఏసీఎస్ సీఈవో రాజేష్ అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

● జైనూర్: మండల కేంద్రంలో సహకార బ్యాంక్ జైనూర్ మేనేజర్ సత్య శివాణి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావ్, మండల సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్ క్యాలెండర్లు ఆవిష్కరించారు.

● కెరమెరి: జంగుబాయి ఆలయ క్షేత్రం ఉత్సవాలకు ముస్తాబు అవుతుంది. జనవరి 2వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పెరుగనున్న డీఏపీ ధర

- నేటి నుంచి అమలు- ఆందోళనలో రైతులు



ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డై అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ఎరువు ధర బస్తాకు ఏకంగా రూ. 240 మేర పెరగనుంది. జనవరి 1వ తేదీ నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో ఈ సీజన్‌లో రైతులపై పెనుభారం పడనుంది. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 4.60 లక్షల ఎకరాలలో, యాసంగి సీజన్‌లో 43,884 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. ఇందులో వానాకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి, 59 వేల ఎకరాలలో వరి, 38 వేల ఎకరాలలో కంది, 680ఎకరాలలో జొన్న, 1700 ఎకరాలలో పెసర, 742 ఎకరాలలో మొక్కజొన్న, సోయాబీన్ 6,089 ఎకరాలు, మిరప 3,173 ఎకరాలు, వేరుశెనగ 178 ఎకరాలు, ఆముదాలు 10 ఎకరాలు, నువ్వులు 10 ఎకరాలలో పంటలను రైతులు సాగు చేశారు. కాగా యాసంగి సీజన్‌లో వరి పంట 21,415 ఎకరాలు, పెసర 1,530 ఎకరాలు, జొన్న 10,202, మొక్కజొన్న 2,560 ఎకరాలు, గోధుమలు 1,044 ఎకరాలు, శెనగ 6516 ఎకరాలు ఇతర పంటలు 617 ఎకరాలలో సాగవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో సుమారు 30వేల బస్తాల డీఏపీ వినియోగం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మరింత భారం పడనుంది..



డీఏపీ ధర కేంద్ర ప్రభుత్వం పెంచడంతో రైతులపై అదనంగా భారం పడనుంది. పం ట ఎదుగుదలకు డీఏపీ ఎంతో అవసరము ఉంటుంది. గతంలో రూ. 1,350కి బస్తా వచ్చేది. కానీ పెంచిన దరల ప్రకారం ఒక బస్తాకు రూ. 240 పెరగడంతో రూ. 1,590 చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం డీఏపీ ధరలను తగ్గించి రైతులను ఆదుకోవాలి.

- నాంచాల రాజు, రైతు, అడ గ్రామస్థుడు

స్ట్రక్చర్ సమావేశంలో డిమాండ్లు విన్నవించాం


మాట్లాడుతున్న గుర్తింపు సంఘం నాయకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఏరియాలో కార్మికులకు సంబంధించి పలు ప్రధాన డిమాండ్లను యాజమాన్యానికి విన్నవిం చామని గుర్తింపు సంఘం మందమర్రి ఏరియా బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలి పారు. మంగళవారం జీఎం కార్యాలయంలో త మ యూనియన్‌తో సమావేశం నిర్వహించగా యాజమాన్యం దృష్టికి ప్రధాన డిమాండ్లను ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రధానంగా కేకే 1 గనిలో బ్యాంకు హెడ్‌పై షీట్స్ వేసి అప్‌గ్రేడ్ చేయా లని, శాంతిఖని గనికి సంబంధించి భవిష్యత్ వివరాలను తెలియజేయాలని కోరామని చెప్పారు. కాసిపేటతో పాటు అన్ని గనుల్లో రక్షణకు సంబంధించి డబ్ల్యూస్టాఫ్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశామని అన్నారు. ఎస్అండ్‌పీసీ షెల్టర్ షెడ్లకు మరమ్మత్తులు చేసి కంప్యూటర్ షెడ్లలో ఏసీ సౌకర్యం కల్పించాలని, ఏరియాలోని అన్ని కాలనీల్లో బ్యాక్ సైడ్ డ్రైనేజీల్లో ఇసుక కూరుకుపోయిందని, పూడిక తొలగించి కార్మికుల ఆరోగ్యానికి సహకరించాలని చెప్పామని తెలిపారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. సమా వేశంలో అక్బర్ అలీ, దాగం మల్లేష్, దాసరి తిరుపతిగౌడ్, సీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్మికులకు సన్మానం

కాసిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట గనిలో పనిచేసి పదవీ విరమణ పొందిన ముగ్గురు కార్మికులను మంగళవారం గనిపై అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్మికులు జక్కం ధర్మయ్య, అన్నమనేని సుధాకర్, పెరుగు లింగయ్యలను గని మేనేజర్ భూశంకరయ్య, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్‌లు ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ ,అండర్‌మేనేజర్ సుమన్, వెల్ఫేర్ ఆఫీసర్ మీర్జాగౌస్‌జిషాన్, బన్న లక్ష్మణ్‌దాస్, ఒడ్నాల రాజన్న, కార్మిక నాయకులు శ్రీనివాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైరుగూడ ఓపెన్‌కాస్టులో పని చేసి పదవీ విరమణ పొందిన కార్మికులను మంగళవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు సన్మానించారు. పదవీ విరమణ పొందిన కొమురయ్య, వెంకటి, శంకర్, రామన్నను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషరావు, చంద్రశేఖర్, దివాకర్, నరేష్, ఓదేలు, రాజయ్య, షకీల్, నరేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య

శ్రీరాంపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న క్లర్కులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ,ఆర్కే5 గనుల్లో క్లరికల్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతీ నెల ఏరియా లెవెల్ జీఎం కమిటీ సమావేశాల్లో క్లర్కుల సమస్యలను చర్చించడానికి వారికే ప్రత్యేకావశాలు కల్పించామన్నారు. క్యాడర్ స్కీం ప్రమోషన్ పాలసీ ఇతర హక్కులు, సదుపాయాలపై ప్రాధాన్యత ఇచ్చే విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలో విషాదం

కాలువలో పడి ఇద్దరు యువకుల మృతి


మృతి చెందిన మంద రాజు, పవన్‌కళ్యాణ్ (ఫైల్)

దండేపల్లి, డిసెంబరు 31(డిసెంబరు): నూతన సంవత్సర వేడుకల్లో విషాదం నెలకొంది. స్నేహితులతో కలిసి దావత్ చేసుకొని తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి కాల్వలో పడిన సంఘటనలో మంగళవారం రాత్రి ఇద్దరు యువకులు మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన మంద రాజు (35), జిల్లాపెల్లి పవన్‌కళ్యాణ్(25) లు బైక్‌పై దండేపల్లి శివారులో అటవీ ప్రాంతంలో న్యూ ఇయర్ పార్టీ చేసుకున్నారు. అనంతరం బైక్‌పై ఇంటికి వస్తుండగా కస్తూర్బా విద్యాలయం సమీపంలోని కడెం ప్రధాన కాలువ పక్కన గల 28వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో ప్రమాదశాత్తు బైక్‌తో సహా పడ్డారు. వారితో వస్తున్న మిగితా స్నేహితులు గమనించి కాలువలో వారిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోపు ఇద్దరు మృతి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. జిల్లాపెల్లి పవన్‌కళ్యాన్ ఇటీవల ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. మంద రాజుకు భార్య మృతి చెందగా 8ఏళ్ల పాప ఉంది.

ఆహార నాణ్యత సక్రమంగా ఉండాలి

భీమిని, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆహార నాణ్యత సక్రమంగా ఉండాలని తహసీల్దార్ బికర్ణదాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, ఆహారంపై విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. డీటీ గోవర్ధన్ ఉన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి

తాండూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం తాండూర్‌లో ఆయన పర్యటించి పంచాయతీ రికార్డులను తనిఖీచేశారు. పారిశుధ్య పనులు, నర్సరీలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఇంటి పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

నస్పూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. న్యాయమైన సమస్యల సాధనకు ఆందోళనలు చేస్తామని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు తెలిపారు. శిబిరాన్ని సెకండరీ గ్రేడ్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు, నాయకుడు శ్రీకర్, విశ్రాంత ఉపాధ్యాయులు సంఘం అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి జగన్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు మద్దతు తెలిపారు.

విరాళాల సేకరణ

బెల్లంపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లో ఈ నెల 5,6,7 తేదీల్లో జరిగే అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ సభల విజయవంతం కోసం నాయకులు మంగళవారం విరాళాల సేకరణ చేపట్టారు. సంఘం నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్నలు మాట్లాడుతూ సభల విజయవంతానికి విరాళాలు సేకరిస్తున్నామని, ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. ఐలయ్య, గోపి, లక్ష్మణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లోవ భీమయ్యక్ మహోత్సవం పోస్టర్ల విడుదల

కాసిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ కొలాంగూడలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే లోవ భీమయ్యక్ వార్షిక మహోత్సవం పోస్టర్లను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆత్రం మహేష్ విడుదల చేశారు. పంచపాండవుల్లో భీముని సంతతికి చెందిన కొలాంలు లోవ భీమయ్యక్‌ను పూజిస్తారన్నారు. వార్షిక మహోత్సవంలో పెద్ద సంఖ్యలో కొలాంలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధ్యక్షుడు భీంరావు, గంగారాం, భీము, మహదు, బొజ్జిరావు, చిన్ను, భగవంతరావు, మారు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 4, 5 తేదీల్లో బర్డ్‌వాచ్

జన్నారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో ఈ నెల 4, 5 తేదీల్లో బర్డ్‌వాచ్ నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు మంగళవారం తెలిపారు. 4న సాయంత్రం బర్డ్‌వాచ్ వీక్షించేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున రుసుం చెల్లించిన అనంతరం అటవీ ప్రాంతంలో బైసన్‌కుంటతోపాటు పలు ప్రాంతాల్లో బస చేసి అనంతరం 5న తెల్లవారుజామున బర్డ్‌వాచ్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తూముల పరిశీలన

జన్నారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కడెం ప్రధాన కెనాల్ 22వ డిస్ట్రిబ్యూటరీ నుంచి నీటిని మళ్లిస్తున్న తూములను మంగళవారం ఆర్ఐ గంగరాజు, ఇరిగేషన్ సూపర్‌వైజర్ శంకర్‌లు పరిశీలించారు. తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాలకు వెళ్ళే నీటిని అక్రమంగా సింగారాయపేటకు మళ్లిస్తున్నారని కలెక్టర్‌కు తిమ్మాపూర్ మాజీ సర్పంచు జాడి గంగాధర్ ఫిర్యాదు చేశాడు. ఇలాంటివి జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

భీమారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నర్సింగాపూర్ పాఠశాల ప్రధానో పాధ్యాయుడు, మండల ఎంఈవో కాచం సురేష్ పదవి విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

జన్నారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఫౌండే షన్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డింగ్, ఆటో మొబైల్, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్ తదితర వాటిలో శిక్షణ ఇస్తామ న్నారు. 2 నెలల ట్రైనింగ్, ఒక నెల ఆన్ టైం జాబ్ ఉంటుం దని తెలిపారు. ఈనెల 5 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9949446802, 9885981959, 9177413107లో సంప్రదించాలన్నారు.

ఇటుకబట్టి కార్మికుల ధరలు పెంపు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో ఇటుకబట్టి కార్మికుల ధరలు పెంచామని రాష్ట్ర అధ్యక్షుడు కేజే రావు అన్నారు. మంగళవారం ఇటుకబట్టీల యాజమాన్యాలతో జరిగిన చర్చల ప్రకారం గత సంవత్స రం వెయ్యి ఇటుకకు రూ. 1080 ఉండగా దానిని రూ. 1200 లకు పెంచామన్నారు. ఐఆర్టీయూ సలహాదారు క్రరై లచ్చ న్న, ఐఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నైనాల వెంకటేశ్వర్లు, నాయకులు సంకె రవి, ఇటుకబట్టి యజమానులు చింతకిం ద బాలయ్య, సిరిపురం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులకు భంగం కలిగించొద్దు

భీమిని, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించొద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ అన్నారు. రాజారం గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. పౌరహక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కుల వివక్ష అంటరానితనాన్ని నిర్మూ లించాలని అన్నీ కులాలు వర్గాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు. పౌరహక్కులపై ప్రజలు అవ గాహన కల్గి ఉండాలన్నారు. కార్యదర్శి జాహీద్, కానిస్టేబుల్ పోచన్నలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



● ఆనందోత్సవాల మధ్య నూతన సంవత్సరం వేడుకలు ● కేక్‌ల అమ్మకాల జోరు...ఇళ్ళ ఎదుట రంగవల్లులు...


రంగులు కొనుగోలు చేస్తున్న యువకులు

నస్పూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కోటి ఆశల తో కొత్త ఏడాదికి ప్రజలు స్వాగతం పలికారు. మంగళ వారం అర్ధరాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. నూత న సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాల జోరు కొనసాగింది. అర్ధరాత్రి వర కు వైన్స్ షాపులు తెరచి ఉన్నాయి. చికెన్, మాంసం అమ్మకాలు ఎక్కువగా జరిగాయి.

● **ముంగిళ్ళలో రంగుల ముగ్గులు...**

కొత్త ఏడాది సందర్భంగా ఇళ్ళ ముంగిట రంగు రంగుల ముగ్గులు వేసేందుకు వివిధ రంగులను కొను గోలు చేశారు. మహిళలు ముత్యాల ముగ్గులు వేసి వాకిళ్ళను అందంగా తీర్చిదిద్దుతారు. మార్కెట్లో లభించే రంగురంగులను కొనుగోలుచేసి ముగ్గులో చూడ ముచ్చటగా అలంకరణ చేస్తారు.

అమ్మకాల జోరు...

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి) : గడిచిన కాలానికి వీడ్కో లు పలుకుతూ కొత్త సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. మార్కెట్లలోని పలు చౌరస్తాల వద్ద, బేకరీల వద్ద న్యూ ఇయర్ కేక్‌లను విక్రయించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇంటి ఎదుట ముగ్గులు వేసేందుకు రకరకాల రంగులను కొనుగోలు చేశారు. ప్రధాన చౌరస్తాల వద్ద ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించారు. పూల వ్యాపారస్థులు ప్రత్యేక బొకే లను అమ్మకానికి సిద్ధం చేశారు. స్వీట్ హౌజ్‌ల యజమానులు న్యూ ఇయర్ వేడుకల కోసం ప్రత్యేక స్వీట్ ప్యాకెట్లను తయారు చేశారు. నూతన సంవత్సర వేడుకలకు టపాసుల దుకాణాల వద్ద క్రాకర్స్‌ను కూడా కొనుగోలు చేస్తున్నారు. హోటళ్ల, రెస్టారెంట్ల నిర్వాహకు లు నాన్ వెజిటేరియన్, బిర్యాని విక్రయించారు.

గ్రీటింగ్ కార్డులు తీపి జ్ఞాపకాలు

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలో గ్రీటింగ్ కార్డులు కనుమరుగయ్యాయి. గతం లో న్యూఇయర్ వచ్చిందంటే గ్రీటింగ్ కార్డులకు గిరాకీ అంతా ఇంతా కాదు. భావాలకు వ్యక్తపరిచేందుకు వివి. ద రకాల కార్డులు ఉండేవి. మనసులోని మాటలకు అక్షర రూపం ఇచ్చి మిత్రులకు వారం రోజుల ముందే పోస్టు చేసే వారు. నేటి సాంకేతిక యుగంలో గ్రీటింగ్ కార్డులు ఉనికి కోల్పోయాయి. నెట్‌లో లభించే వివిధ రకాల గ్రీటింగ్ స్టిక్కర్లను పంపిస్తూ క్షణాల్లో శుభా కాంక్షలు తెలుపుకుంటున్నారు.

క్రిస్మస్ ముందు నుంచే గ్రీటింగ్ కార్డులు విక్రయించే వారు. న్యూఇయర్, సంక్రాంత్రి వరకు కార్డులు పంపిం చే వారు. ఇప్పుడు వాటి ఊసేలేదు. దీంతో అవి తీపి జ్ఞాపకాలుగా మిగిలాయి.

గతంలో స్కూల్ స్థాయి నుంచి కళాశాల స్థాయి వర కు యేటా గ్రీటింగ్ కార్డుల ద్వారానే యువతి, యువ కులు శుభాకాంక్షలు చెప్పకునే వాళ్లు. సెల్‌ఫోన్ ప్రపం చంతో గ్రీటింగ్‌ల జాడని లేకుండా పోయింది.

మార్కెట్‌లో సందడి

మందమర్రి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఇయర్ వేడు కలకు మందమర్రి మార్కెట్లో సందడి నెలకొంది. రంగులతో పాటు కేకులు కొనేందుకు పెద్ద సంఖ్యలో వినియోగదారులు తరలి వచ్చారు. పలు బేక రీలు కేక్‌లకు ప్రత్యేక ఆఫర్లు పెట్టారు. రెండు కిలోల కేక్ కొంటే కిలో కేక్ ఉచితంగా ఇస్తున్నారు. మద్యం షాపులకు గిరాకీ విపరీతంగా పెరిగింది. స్థానిక రామన్ కాలనీ రాజన్నల వాడ వద్ద మేకల ధరలు కొండెక్కాయి. ఒక్కో మేక పది వేల చొప్పున విక్రయించారు. ఎంపీటీసీ, ఎస్అండ్‌పీసీ కార్యాలయం పక్కన కొందరు మేకలను విక్రయించారు. చికెన్ సెంటర్లు కూడా కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయాయి. యువకులు పెద్ద సంఖ్యలో న్యూ ఇయర్ వేడుకల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని ఓ రిసార్టును కూడా వేడుకలకు బుక్ చేసుకున్నారు.

సుమధుర జ్ఞాపకాల నిధి.. డైరీ

దండేపల్లి, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి) : డైరీ గడిచినకాలంలో మన ఆలోచనలను అక్షరాల రూపంలో గుర్తు చేస్తుంది. పాత సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సంకల్పాలు సాధించిన విజయాలు, ఓటములను జ్ఞాపకం చేస్తుంది. 2024 సంవత్సరానికి వీడ్కో లు పలుకుతూ మన ఆలోచనలకు అద్దం పట్టే విధంగా 2025లో డైరీ రాయడానికి అలవాటు పడుదాం.

● గతేడాది రాసిన డైరీని ఒక్కసారి చదువుకుంటే.. మనం చేయలేని పనులు తెలిసిపోతాయి. వాటిని సమీక్షించుకుని ఈ యేడాది వాటి సాధనకు కృషి చేయవచ్చు. మనం సాధించిన లక్ష్యాలు, చేరుకున్న గమ్యాలను ఆయా తేదీలను, ఆనాటి ఆనందాలను మరో సారి గుర్తు చేసుకోవచ్చు.

● ఇంటర్‌నెట్, ఆధునికమైన ఫోన్లు అందుబాటులోకి వచ్చాక ఉత్తరాలు రాయడం పూర్తిగా తగ్గిపోయింది. ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్‌ల హవా కొనసాగుతుంది. మన అనుభవాలను, భావాలను రాతలో వ్యక్తం చేయలేని పరిస్థితి ఏర్పడింది. డైరీ రాయడం వల్ల ఆ కొరత తీరుతుంది. మీ రాయగలిగే సామర్థ్యం పెరుగుతుంది.

● డైరీలో ఏమి రాయాలో తెలియక వారం పది రోజులకే ఆపేస్తారు. ఆ తర్వాత ఏ చిత్తు పద్దుల నమోదుకో, చిన్న పిల్లల ఆటకో అంకి తమవుతుంది. అలా కాకుండా ఆ రోజు జరిగిన ప్రతీ సంఘటనను అక్షరాల్లో నిక్షిప్తం చేయాలి.

● ఇష్టమైన స్నేహితులు, స్ఫూర్తిగా నిలిచిన ఉపాధ్యాయల గురించి విద్యార్థులు రాసుకోవచ్చు. పాఠశాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో పాల్గొన్న విషయాలను అక్షరాల్లో ఒదగవచ్చు, సెలవుల్లో వెళ్లిన ఊర్ల గురించి రాయొచ్చు. విహారయాత్రల విశేషాలు వివరించవచ్చు.

ఇలా చేద్దాం..

● వ్యాయామం అలవాటు చేసుకోండి. రోజు కనీసం 40 నిమిషాలైన వాకింగ్ చేయాలి. వ్యాయామం రోజంత ఉల్లాసాన్నిస్తుంది. దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. దీంతో వ్యాధులు దరిదాపులోకిరావు.

● మద్యం అలవాట్లు మానేయండి. ఆ వైపు ఆలోచన మరలకుండా బిజీగా లైఫ్‌స్టైల్ మార్చుకోండి.

● ఆదాయానికి అనుగుణంగా ఖర్చు చేయాలి, ఇరుగుపొరుగు వారిని చూసి పోటీగా ఖర్చు చేయవద్దు. సినిమాలు, షికారులకు, దుబారా ఖర్చులు మానుకోవాలి. ఆదాయంపై ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఈ యేడు ఉద్యోగం సాధిస్తాను



నేను బీటెక్ పూర్తి చేశాను. గ్రూప్స్‌తో పాటు ఇతర ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నాను. కొత్త సంవత్సరంలో ఉద్యోగ సాధనే లక్ష్యంగా కష్టపడి చదివి ఉద్యోగం సాధిస్తాను.

- వంశీ, శ్రీరాంపూర్

ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తా



ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తాను. సింగరేణి బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణించేందుకు ప్రణాళిక రూపొందించు కున్నా. బాడీ బిల్డింగ్ పోటీల్లో విజయం సాధించి బెల్లంపల్లికి పేరు తీసుకు రావాలని నిర్ణయించుకున్నా. రోజు వ్యాయామం చేసి ఫిట్‌నెస్ సాధించి మంచి ఆరోగ్యం, మంచి ఆలోచనలతో కొత్త సంవత్సరంలో ముందుకు వెళ్తాను.

- పన్నాల, సదానందం, బెల్లంపల్లి

బంగారు భవిష్యత్‌కు వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్తామంటున్న పలువురు

బెల్లంపల్లి,(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో పలువురు ఏదో ఒక కొత్త పని చేయాలని సంకల్పిస్తారు. వ్యాపార, విద్య క్రీడ, ఇతర వర్గాల కు చెందిన వారు తమ భవిష్యత్ కోసం సమాలో చనలు చేస్తుంది. తమ కలలను సాకారం చేసుకోవడానికి లక్ష్యాలను నిర్దేశించుకుంటుంది. నూతన సంవ త్సరంలో ఆటలు, ఆంక్షలపై ఆంధ్రజ్యోతి కథనం...

న్యాయవాదిగా మరింత రాణిస్తాను



న్యాయవాదిగా రాణించడానికి మరిన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాను. గతంలో ఎంతో మందికి నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలు అందించాను. ఎంతో మందికి న్యాయ సలహాలు సైతం సూచించాను. ఉచిత న్యాయ సదస్సులు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పిస్తాను.

- మాదరి రాకేష్, న్యాయవాది, బెల్లంపల్లి

రాజకీయంగా రాణించేందుకు ప్రణాళిక



చిన్నప్పటి నుంచి రాజకీయాల్లో రాణించా లనే ఆలోచన ఉండేది. ఈయేడు మరింతగా రాణించి మంచి భవిష్యత్‌కు బాసలు వేసు కుంటాను. యువత రాజకీయాల్లో రాణించేందుకు మరింత కృషి చేస్తాను. నేటి యువత విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాణిస్తూ ముందుకు వెళ్తున్నారు.

- సన్నిబాబు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు







కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు 6
● 50కి పైగా దరఖాస్తులు
● ప్రభుత్వానికి అధికారుల నివేదిక

న్యూ ఇయర్ వేడుకలో విషాదం 7
● బైక్ అదుపు తప్పి కాలువలో పడి ఇద్దరు యువకుల మృతి

న్యూ ఇయర్ జోష్



కాల చక్రంలో మరో ఏడాది కనుమరుగైంది. గత యేడాది మిగిల్చిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం నుంచే విందులు, సంబరాలు ప్రారంభమయ్యాయి. మద్యం, మాంసం, కేక్‌లు, కూల్ కేక్‌లు, రంగవల్లుల, కూల్‌డ్రింక్‌లు, రకరకాల రంగులు విక్రయాలు జోరుగా సాగాయి. ఆయా కూడళ్ళ దగ్గర, స్వీట్ హౌజ్, ఇతర దుకాణాల వద్ద కేక్‌లు విక్రయించారు. నూతన సంవత్సరం 2025కు స్వాగతం పలుకుతూ మంగళవారం రాత్రి 12 గంటలకు సంబరాలు అంబరాన్నంటాయి.

మంచిర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా యువత మస్త్‌గా ఎంజాయ్ చేశారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలకడం కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొనేం దుకు జిల్లా వ్యాప్తంగా ముఖ్య పట్టణాలు, ఫాం హౌజ్‌లు, హోటళ్లను ముందుగానే బుక్ చేసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచే మాంసం, మద్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పోలీస్‌శాఖ డీజేల నిషేధం, డ్రంకెన్ డ్రైవ్ ఆంక్షలు విధించినప్పటికీ 31న రాత్రి యువత పెద్ద మొత్తంలో పార్టీల్లో మునిగి తేలింది. మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేసి, డ్యాన్సుల్లో మునిగి తేలారు.

ఏరులై పారిన మద్యం

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారింది. హాజీపూర్ మండలం గుడిపేట సమీపంలో ఉన్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) గోదాంలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. లిక్కర్ గోదాం నుంచి జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధి లోని షాపుల్లో మద్యం కొనుగోళ్లకు జనం బారులు తీరారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31న భారీ అమ్మకాలు నమోదయ్యాయి. చివరి రోజున ఏకంగా రూ.8 కోట్ల 10 లక్షల విలువగల విక్రయాలు జరగడం గమనార్హం. 2024 ముగింపు సందర్భంగా చివరి మూడు రోజుల్లో రూ.11.26 కోట్ల మద్యం విక్రయాలు నమోదయ్యాయి. గతేడాదితో పోల్చితే మద్యం అమ్మకాలు పెరిగాయి. 2023 డిసెంబరు 31న రూ.5 కోట్ల 69 లక్షల విలువ గల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాది మొత్తం రూ. 11కోట్ల 19 లక్షల అమ్మకాలు జరుగగా, ఈయేడు రూ.7 లక్షల పై చిలుకు అమ్మకాలు అధికంగా నమోదయ్యాయి. ఈ సంవత్సరం 10,570 కేసుల లిక్కర్ అమ్మకాలు జరుగా 14,296 కేసుల బీర్ల విక్రయాలు నమోదయ్యాయి. బీర్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి.



మాంసం కొనుగోళ్లు...

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లాలో పెద్ద మొత్తంలో మాంసం కొనుగోళ్లు జరిగాయి. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల వంతెన సమీపంతో పాటు హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని మేకల మండీల్లో పెద్ద మొత్తంలో మేకలను విక్రయించారు. జిల్లాలోని కోల్‌బెల్ట్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని మటన్ షాపుల్లో సుమారు రూ. కోటి విలువగల మాంసం విక్రయాలు జరిగినట్లు మండీల నిర్వాహకులు చెబుతున్నారు. వీటికి అదనంగా పాత మంచిర్యాల సమీపంలోని రంగంపేట, శ్రీరాంపూర్, తాం డూర్ ఐబీ, పెద్దపల్లి జిల్లా రాజారాంపల్లి, తదితర ప్రాంతాల నుంచి జిల్లా వాసులు పెద్ద మొత్తంలో మేకలు కొనుగోలు చేశారు. చికెన్ సెంటర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. జిల్లా కేంద్రంలోనే రూ. 60 లక్షల విలువ గల చికెన్ అమ్మకాలు జరిగి నట్లు తెలుస్తోంది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేకులు

కిటకిటలాడిన బేకరీలు..

కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే క్రమంలో ప్రజలు మంగళవారం ఉదయం నుంచే కేకులు కొనుగోలు చేశారు. జిల్లా కేంద్రంలోని క్వాలిటీ బేకరి, పాత మంచిర్యాలలోని రామకృష్ణ బేకరి ఔట్ లెట్లు, స్వీట్ హౌజ్‌లు కిటకిటలాడాయి. మంచిర్యాల, నస్పూర్, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాల్లో రోడ్ల పక్కన తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి కేకులు విక్రయించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ షాపుల్లో రూ. 4 కోట్ల పైచిలుకు విలువైన కేక్‌లు, స్వీట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి 12 గంటలు కాగానే ప్రజలంతా కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకుంటూ నూతన సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికారు.

మందుబాబులకు నిబంధనలు....

న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపేవారికి పోలీస్‌శాఖ కఠిన నిబంధనలు విధించింది. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కమిషనరేట్ పరిధిలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. రెండు మూడు రోజుల ముందు నుంచే తనిఖీలు ఏర్పాటు చేస్తామని పోలీస్‌శాఖ ప్రకటించింది. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి భారీ మొత్తంలో జరిమానా విధించేందుకు రంగం సిద్ధమైంది.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు ఇసుక రీచ్‌ల నుంచి తీయడం జరుగుతుందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుం దని, చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈయేడు చింతల పల్లి వే బ్రిడ్జి నుంచి 328 ట్రిప్పుల్లో 1,312 మెట్రిక్ టన్నుల ఇసుకను 47వేల468 రూపాయలకు విక్రయించామని, కొల్లూరు వద్ద ఉన్న 3 వేబ్రిడ్జిల నుంచి 78 ట్రిప్పుల్లో సుమారు 2,340 మెట్రిక్ టన్నుల ఇసుకను 8లక్షల77వేల500 రూపాయలకు విక్రయించామన్నారు. ఒక ట్రిప్పులో దాదాపు 30 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంటుందని, అంతకుమించి ఉంటే అన్‌లోడింగ్ చేస్తామన్నారు. 2024 సంవత్సరంలో 4 కేసులు నమోదు చేసి 2లక్షల12వేల360 రూపాయల జరిమానా రుసుం వసూలు చేశామన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిబంధనలకు లోబడి ఇసుకను తరలించడం జరుగుతుందన్నారు. అక్రమంగా ఇసుక తరలించినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. వార్తా పత్రికలు, న్యూస్ చానళ్లలో ఇసుక అక్రమ రవాణాపై వార్తలు వస్తున్నాయని, ఒకసారి ప్రజల్లోకి వెళ్లిన వార్తను తిరిగి తీసుకోలే మని, పాత్రికేయులు బాధ్యతగా వ్యవహరించి ఈ అంశంపై నిజనిర్ధారణ చేసుకుని పూర్తి ఆధారాలతో వార్తలు ప్రచురించాలని, ప్రసారం చేయాలని తెలిపారు. సమావేశంలో పాత్రికేయులు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.95 కోట్ల24 లక్షలు జమ

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ. 95కోట్ల24 లక్షల నగదును సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 317 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 73741 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8169 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. 147 కేంద్రాల్లో కొనుగోలు లక్ష్యం పూర్తి కావడంతో మూసి వేశామన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

పోలీసులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

గంజాయి, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మందమర్రిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లు పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. సీపీ మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని, ప్రజలు మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తును నమోదు చేసి రశీదు ఇవ్వాలని సూచించారు. రౌడీషీటర్లపై, ట్రబుల్ మ్యాంగర్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, సత్వర న్యాయం జరిగేలా వారికి భరోసా కల్పించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని సూచించారు. సీపీ, డీసీపీలు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, రామకృష్ణపూర్, కాసిపేట, దేవాపూర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి కృషి చేయాలి

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): విధుల్లో అప్రమత్తంగా ఉంటూ నేరాల కట్టడికి పోలీసులు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళ వారం ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. సీపీకి ఏసీపీ రవికుమార్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయం లోని రికార్డులను పరిశీలించి కేసుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నారు. సీపీ మాట్లా డుతూ నేరం జరిగిన వెంటనే వేగంగా స్పందించాలని సూచిం చారు. నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీ సింగ్, నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక వాహనాల తనిఖీలు నిర్వహిం చాలన్నారు. ప్రజల మన్ననలు పొందేలా పోలీసులు విధులు నిర్వర్తించాలన్నారు. డీసీపీ భాస్కర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాండూర్, మందమర్రి సీఐలు కుమారస్వామి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

మంచిర్యాల క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టే బుళ్లుగా పనిచేస్తూ ఏఎస్ఐగా పదోన్నతి పొందిన గులాం దస్తగిరి, ఇలియాస్‌ఖాన్, పద్మనాభంలను మంగళవారం అభినందించి పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పోలీసుల పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతా ప్, సుందర్‌రావు, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం , స్వామి పాల్గొన్నారు.



పదోన్నతి చిహ్నాన్ని అలంకరిస్తున్న సీపీ శ్రీనివాస్